ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 13-10.2025 సమయం : 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. జూబ్లీహిల్స్ శాసనసభ స్థానం ఉప ఎన్నికకు ఈరోజు నోటిఫికేషన్ విడుదలయ్యింది. తొలిరోజు మధ్యాహ్నం 12 గంటలవరకు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.
2. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు ఈనెల 22 నుంచి ప్రారంభించడానికి ప్రయత్నాలు చేయనున్నట్లు భారత పత్తి సంస్థలు ప్రభుత్వానికి తెలిపింది.
3. ఆర్టీసీ వరంగల్ రీజియన్ కు మరో వంద ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించినట్లు రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి చెప్పారు.
4. ఈరోజు రాష్ట్రంలోని పద్నాలుగు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

-----------------------

**జూబ్లీ హిల్స్**

హైదరాబాద్ జూబ్లిహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నిక నోటిఫికేషన్ ఈ ఉదయం విడుదల అయింది. షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఈ రోజు నుంచి, ఈ నెల 21 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఈ నెల 24 తో నామినేషన్ల ఉప సంహరణకు గడువు ముగుస్తుంది. ఇలా ఉండగా, వచ్చే నెల 11 న జరిగే పోలింగు కోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మరో వైపు, ఎన్నికల నిబంధనావళిని అధికారులు కట్టుదిట్టంగా అమలుచేస్తున్నారు. జూబ్లీ హిల్స్ సిట్టింగ్ శాసనసభ్యులు మాగంటి గోపీనాథ్ హఠాన్మరణంతో ఉప ఎన్నిక అనివార్యం అయింది. BRS ఇప్పటికే దివంగత మాగంటి గోపీనాథ్

భార్య మాగంటి సునీతను పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది. కాంగ్రెసు పార్టీ నవీన్ యాదవ్ ను అభ్యర్థిగా నిలబెట్టింది. కాగా BJP ఇంకా తమ అభ్యర్థి పేరు ప్రకటించాల్సిఉంది.

**MSL**

------------------------

**నామినేషన్లు**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నామినేషన్ల పర్వం అధికారికంగా ప్రారంభమైంది. తొలి రోజు ఇప్పటి వరకు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

**పీటీసీ హైదరాబాద్**

------------------

**ఉప ముఖ్యమంత్రి:**

చండీగఢ్ లో ఆత్మహత్యకు పాల్పడిన IPS అధికారి పూరణ్ కుమార్ కుటుంబ సభ్యులను తెలంగాణా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పరామర్శించారు. దేశంలోని అత్యున్నత సర్వీసులో పనిచేస్తున్న అదనపు డీజీ స్థాయి అధికారికే సామాజిక న్యాయం దక్కని పరిస్థితుల పట్ల ఉపముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై చండీగఢ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ ప్రసాద్ తో ఉపముఖ్య మంత్రి మాట్లాడినట్లు ఒక అధికారిక ప్రకటన లో పేర్కొన్నారు. AICC నాయకుడు కొప్పుల రాజు, సంవిధాన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వినయ్ కూడా ఉపముఖ్యమంత్రి వెంట ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి IAS అధికారిణి, పూరణ్ కుమార్ భార్య అమ్నీత్ తో ఫోనులో మాట్లాడారు. పూరణ్ కుమార్ తల్లి దండ్రులను కూడా ఉప ముఖ్యమంత్రి పరామర్శించారు.

**MSL**

----------------------

**పత్తి కొనుగోళ్లు**

రాష్ట్రంలో భారత పత్తి సంస్థ కొనుగోలు కేంద్రాలు ఈ నెల 22 నుంచి ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రభుత్వానికి తెలియజేసింది. జిన్నింగ్ మిల్లుల్లో జాబ్‌వర్క్ టెండర్ల ప్రక్రియ తుది దశకు చేరిందని, అది పూర్తయ్యాక కొనుగోళ్లను చేపట్టనున్నట్లు సీసీఐ పేర్కొంది. మరోవైపు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పత్తి కొనుగోళ్లపై నిన్న టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెటింగ్ అధికారులతో మాట్లాడారు. పత్తి కొనుగోళ్ల కోసం అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. 'కపాస్ కిసాన్' యాప్‌లో సాంకేతిక ఇబ్బందులు రాకుండా చూడాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలని సూచించారు.

**డెస్క్**

---------------------

**రేవంత్ సంతాపం**

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మా రెడ్డి మరణంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. NSS వార్తా ఏజెన్సీ స్థాపకుడిగా, శాసన సభ్యుడిగా, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా, జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా ఆయన సేవలందించారని సీఎం కొనియాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా కొండా లక్ష్మారెడ్డి మృతికి సంతాపం తెలియజేశారు.

**పీఎస్**

------------------------

**మహేష్ సంతాపం**

చేవెళ్ల మాజీ శాసనసభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ కొండా లక్ష్మా రెడ్డి మృతి పట్ల ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతి ని ప్రకటించారు.

**పీఎస్**

------------------------

**సిరిసిల్ల పోషణ మాసం**

జాతీయ పోషణ మాసం సందర్భంగా జిల్లాలోని 586 అంగన్వాడి కేంద్రాలలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీ రాజం చెప్పారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ..

**బైట్ - లక్ష్మీ రాజం, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి**

**పీటీసీ సిరిసిల్ల**

---------------------

**నరెడ్కో కిషన్ రెడ్డి**

రియల్ ఎస్టేట్ రంగాన్ని బలోపేతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని హైటెక్స్ లో నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో 2025 కార్యక్రమంలో నిన్న మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఆధునిక వసతులు, హంగులతో కూడిన హౌసింగ్ సదుపాయాలు ప్రతి నగరంలో అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. దేశంలో రోడ్‌వేస్, ఎయిర్‌వేస్, రైల్వేస్, వాటర్‌వేస్ అన్నీ అత్యాధునిక స్థాయిలో రూపుదిద్దుకుంటుని మంత్రి అన్నారు.

**పీఎస్**

-------------------

**వరంగల్ ఆర్టీసీ**

వరంగల్ రీజియన్ కు మరో వంద ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించినట్టు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండి వై.నాగిరెడ్డి వెల్లడించారు. హనుమకొండ, వరంగల్ నగరాలలో మాత్రమే ఈ ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తాయని వెల్లడించారు. ఎండిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి వరంగల్ కు విచ్చేసిన ఆయన డిప్యూటీ రీజినల్ మేనేజర్లు, వివిధ డిపోల మేనేజర్లు,

అధికారులతో సమీక్ష నిర్వహించారు. సేవలు అందించిన కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్లు, సిబ్బందికి అవార్డులను ప్రదానం చేశారు.

**పీటీసీ వరంగల్**

------------------

**ఆసిఫాబాద్ గంజాయి**

ఆసిఫాబాద్ జిల్లాలో పంటచేలలో సాగుచేస్తున్న గంజాయి ఆనవాళ్లను డ్రోన్ కెమెరాల సాయంతో గుర్తిస్తున్నారు. ఈ క్రమంలోనే కెరమెరి మండలంలోని అంతాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ సత్యనారాయణ, ఇతర సిబ్బందితో కలిసి ఒక చేనులో 51 గంజాయి మొక్కలు గుర్తించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ చిత్తరంజన్ ఆకాశవాణితో మాట్లాడుతూ...

**సౌండ్ బైట్ - ఎస్పీ చిత్తరంజన్**

**పీటీసీ ఆసిఫాబాద్**

--------------------------

**SafeRideChallenge:**

రహదారి భద్రతా అంశాలపై పౌరులను ప్రోత్సహించేందుకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ V C సజ్జనార్ సేఫ్ రైడ్ ఛాలెంజ్ పేరిట సోషల్ మీడియా ప్రచారాన్ని ప్రారంభించారు. దీనికింద మోటారు వెహికల్ డ్రైవర్లు రోజు ఇంటినుంచి బయలు దేరేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్ ఉపయోగిస్తూ, చిన్న వీడియో లేదా ఫోటోను సోషల్ మీడియాలో పోస్టు చేయాలని సజ్జనార్ సూచించారు.

**MSL**

-----------------------

**ప్రజావాణి రద్దు**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హరిచందన తెలిపారు.

డెస్క్

------------------------------

**సిరిసిల్ల ఎక్సైజ్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాల టెండర్ల కోసం వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. గత సంవత్సరం టెండర్లు దాఖలు చేసిన వాళ్లకు 16వేల మెస్సేజ్లు పంపించారు. అలాగే, కరపత్రాలు బ్యానర్ల ద్వారా కూడా ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో 48 మద్యం దుకాణాలకు టెండర్లు పిలవగా 28 దుకాణాలకు మాత్రమే టెండర్లు దాఖలయ్యాయని, అందుకే ఇలా ప్రచారం చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలియజేశారు.

**పీటీసీ సిరిసిల్ల**

----------------------

**యాదాద్రి వర్షాలు**

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. నిరంతరంగా కురుస్తున్న వర్షాలతో పలు మండలాల్లో సాధారణ జీవనానికి అంతరాయం కలిగింది. మోత్కూరు మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న ధాన్యం వర్షానికి తడవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. పెద్దకొండూరు గ్రామపంచాయతీ పరిధిలోని నక్కలగూడెంలో అధిక వర్షం కారణంగా కోళ్ల ఫారం లోకి నీరు చేరి, దాదాపు ఆరు వేల కోళ్లు మృతి చెందాయి. ఆత్మకూరు (ఎం) మండలం కూరెళ్ల గ్రామంలోని ఓ ఇంట్లోకి వర్షపు నీరు చేరి ఇబ్బందులు ఏర్పడ్డాయి.

**పీటీసీ యాదాద్రి**

--------------------------

**వాతావరణం**

భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి, వరంగల్, పెద్దపల్లితో సహా పద్నాలుగు జిల్లాల్లో అక్కడక్కడా ఈరోజు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం

తెలియజేసింది. ఆయా జిల్లాలకు పసుపురంగు హెచ్చరిక జారీ చేసింది. రేపు కూడా 21 జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉంటుందని వెల్లడించింది.

**పీఎస్**

---------------------

**నల్గొండ సాగర్**

కృష్ణా నదిలో ఎగువ నుంచి వస్తున్న భారీ వరదనీటి కారణంగా నాగార్జున సాగర్ ప్రాజెక్టు జలాశయం నిండు కుండలా మారింది. దీంతో సాగర్ 4 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

**పీటీసీ నల్గొండ**

-----------------------------

**థ్రాంబోసిస్ డే**

ఈ రోజు వరల్డ్ థ్రాంబోసిస్ డే. రక్త నాళాలైన సిరలు, ధమనులలో రక్తం గడ్డకట్టడాన్ని థ్రాంబోసిస్ అంటారు. ఇది శరీరంలోని అవయవాలకు రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. ఇవి గుండె, ఊపిరితిత్తులు లేదా మెదడు వంటి అవయవాలకు చేరుకొని ప్రాణాంతకం కావచ్చు. అయితే, థ్రాంబోసిస్ గురించి ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచడం, దీనికి కారణాలు, ప్రమాద కారకాలు, లక్షణాలు, నివారణ, చికిత్సల గురించి తెలియజేయడం, సకాలంలో చికిత్సను ప్రోత్సహించడం ఈ రోజు ఉద్దేశ్యం.

**డెస్క్**

---------------------